## క్లుప్తంగా

### ఎంపీటీసీ పోలింగ్ కేంద్రాల డ్రాఫ్ట్ విడుదల

డొంకేశ్వర్(ఆర్మూర్): స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ వేగంగా జరుగుతోంది. ఎంపీటీసీ ఎన్నిక నిర్వహణకు పోలింగ్ కేంద్రాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. డొంకేశ్వర్ మండలంలో మంగళవారం అన్ని గ్రామ పంచాయతీల్లో పోలింగ్ కేంద్రాల డ్రాఫ్ట్‌ను విడుదల చేశారు. మండలంలో ఏడు ఎంపీటీసీ స్థానాలుండగా, మొత్తం 33 పోలింగ్ కేంద్రాలున్నాయి. పోలింగ్ కేంద్రాల మార్పుపై ఓటర్ల నుంచి ఈ నెల 13వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నారు. అభ్యంతరాలు పరిశీలించి 15న తుది జాబితాను ఖరారు చేస్తామని ఎంపీడీవో శ్రీనివాస్ రావు వెల్లడించారు.

### ఎండీసీ చైర్మన్‌కు వినతిపత్రం అందజేత



కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్‌లో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ టెండర్ ప్రక్రియ ఎండోమెంట్ ద్వారా పూర్తి చేయించాలని స్థానిక గ్రామాభివృద్ధి కమిటీ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్‌కుమార్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డిలకు విన్నవించింది. మంగళవారం హైదరాబాద్‌లో చైర్మన్‌లను వేర్వేరుగా కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. వీడీసీ అధ్యక్షుడు ఆనంద్, కార్యదర్శి రాములు, సభ్యులు చిన్నారెడ్డి, బందెల రాజు, నారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### విద్యార్థి మానసిక నైపుణ్యం పుస్తకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్



ఆర్మూర్: పట్టణ సామాజిక సేవకులు పట్వారీ తులసి కుమార్ అన్నయ్య రిటైర్డ్ ఐఏఎస్ అధికారి న్యూఢిల్లీ విక్రమ్ సింహారావు రచించిన విద్యార్థి మానసిక నైపుణ్యం పుస్తకాన్ని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలోని ఆయన కార్యాలయంలో మంగళవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల కోసం రూపొందించిన మానసిక పరివర్తన, వివిధ అంశాలతో విద్యార్థులను, యువతను దృష్టిలో ఉంచుకొని రూపొందించిన ఈ పుస్తకాన్ని గ్రంథాలయాలతో పాటు వివిధ ప్రభుత్వ పాఠశాలలో అందజేస్తామని తులసి కుమార్ తెలిపారు.

### కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు మంగళవారం ఎస్సీఈఆర్టీ ఆధ్వర్యంలో మోటివేషన్ సెషన్ అండ్ ఎక్స్‌పర్ట్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీసాట్ నిపుణ ఛానల్‌లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా తెలంగాణ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ యోగితా రాణా విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం ప్రత్యక్ష ప్రసారంలో నిపుణలచే కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు అనంతరావు, లక్ష్మణ్, భారతి, శోభ తదితరులు పాల్గొన్నారు.

### తడి, పొడి చెత్తను వేరు చేయాలి

ఆర్మూర్: తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపాలిటీ ఆటోల్లో వేయాలని మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్ సూచించారు. పట్టణంలోని 1వ వార్డులో మహిళలకు అవగాహన పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో మున్సిపల్ పర్యావరణ ఇంజినీర్ పూర్ణమాళి, వార్డ్ ఆఫీసర్ యుగంధర్, మున్సిపల్ ఆర్పీ కవిత, మున్సిపల్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

### వివాహిత అదృశ్యం

రుద్రూర్: మండల కేంద్రానికి చెందిన ఓ వివాహిత అదృశ్యమైనట్లు ఎస్సై సాయన్న మంగళవారం తెలిపారు. ఆమె ఈ నెల 5న ఉదయం నుంచి కనిపించక పోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో భర్త శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### దరఖాస్తుల స్వీకరణ

ఆర్మూర్: పట్టణంలో నిర్వహించనున్న నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(న్యాక్) క్యాంపు కోసం నిరుద్యోగ యువత నుంచి మంగళవారం దరఖాస్తులు స్వీకరించారు. కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి సూచనతో ఆర్మూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్ దరఖాస్తులు తీసుకున్నారు. మాజీ కౌన్సిలర్ ప్రసాద్, నాయకులు కొంతం మురళి, జిమ్మి రవి, గంగాధర్, ఆలూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్, నల్ల గంగాధర్, చిట్టిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సొంత నిర్ణయాలు తీసుకోవద్దు

- ఎన్నికల నియమావళికి అనుగుణంగా విధులు నిర్వర్తించాలి
- ఆర్వోలు, ఏఆర్వోలకు కలెక్టర్ సూచన



చేపూర్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

ఆర్మూర్: ఎన్నికల విధుల్లో రిటర్నింగ్ అధికారులు (ఆర్వో),సహాయ రిటర్నింగ్ అధికారులు(ఏఆర్వో)లు సొంత నిర్ణయాలు అమలు చేయొద్దని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలను ఎలక్షన్ కమిషన్ నియమ, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలన్నారు. ఆర్మూర్ మండలం చేపూర్ శివారులోని క్షత్రియ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఆర్వోలు, ఏఆర్వోలకు పంచాయతీ ఎన్నికల మొదటి దశ నిర్వహణ తీరుతెన్నులపై శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. చట్టబద్ధతతో కూడిన ఎన్నికల విధులను ఎంతో జాగ్రత్తగా నిర్వర్తించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల సంఘం ద్వారా అందించబడిన హ్యాండ్ బుక్ (కర దీపిక)ను చదువుకొని ఈసీ మార్గదర్శకాల మేరకు సజావుగా ఎన్నికలు జరిగేలా కృషి చేయాలని హితవు పలికారు. ఎలాంటి సందేహాలు ఉన్నా అధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు అనువుగా ఉండే గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ముందుగానే ఎంపిక చేసుకొని ఈసీ మార్గదర్శకాలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఉన్నతాధికారులకు డైలీ రిపోర్టును పంపించాలని, సంబంధిత వెబ్‌సైట్లో అభ్యర్థుల నామినేషన్ పత్రాలను స్కాన్‌చేసి అప్లోడ్ చేయాలని సూచించారు. బ్యాలెట్ పత్రాన్ని జాగ్రత్తగా రూపొందించాలని, పోటీలో ఉన్న అభ్యర్థుల పేర్లు, వారికి కేటాయించిన గుర్తులతోపాటు 'నోటా' సింబల్‌ను కూడా తప్పనిసరిగా చేర్చాలని సూచించారు. పూర్తి పారదర్శకంగా ఎన్నికలను నిర్వహించాలన్నారు. ఆర్డీవో రాజాగౌడ్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, కమిషనర్ రాజు, ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, డీఎల్పీవో శివకృష్ణ, ఆర్వోలు, సహాయ ఆర్వోలు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంపీవోలు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్యసేవలు అందించాలి

బాల్కొండ: ప్రభుత్వాస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఆస్పత్రిలో కాన్పులు క్రమం తప్పకుండా చేపట్టాలన్నారు. సాధ్యమైనంత వరకు సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. ఆస్పత్రిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. వైద్యులు అందుబాటులో ఉండి సేవలు అందించడంపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. అంతకు ముందు మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలల్లో స్నానపు గదులు తక్కువగా ఉన్నాయని కలెక్టర్ దృష్టికి ఉపాధ్యాయులు తీసుకువచ్చారు. సమస్యను పరిష్కరించేలా కృషి చేస్తానని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, తహసీల్దార్ శ్రీధర్, వైద్యాధికారిణి శృతి, ప్రిన్సిపాల్ చందన తదితరులు ఉన్నారు.



బాల్కొండ ప్రభుత్వాస్పత్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

## పంప్ హౌస్ మోటార్‌కు మరమ్మతులు చేపట్టాలి

కమ్మర్‌పల్లి: హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకం పంప్ హౌస్ మోటార్‌కు మరమ్మతులు చేయించాలని మండలంలోని బషీరాబాద్ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డికి విన్నవించారు. మంగళవారం వీడీసీ సభ్యులు ఎమ్మెల్యేను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. మోటార్ పంపు తరచు చెడిపోతుండడంతో నీటి విడుదలలో సమస్య తలెత్తుతోందని వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే మోటార్ పంపు మరమ్మతుల కోసం అంచనాలు తయారు చేసి సమస్యను పరిష్కరించాలని సంబంధిత ఏఈని ఫోన్‌లో ఆదేశించారు. అదేవిధంగా వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి ఎండోమెంట్ ద్వారా టెండర్ ప్రక్రియ పూర్తి చేయించాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. వీడీసీ అధ్యక్షుడు ఆనంద్, రాములు, రాజు, బుచ్చన్న, చిన్నారెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డిని కలిసిన వీడీసీ సభ్యులు

## త్రిపుర గవర్నర్‌ను కలిసిన బీజేపీ నాయకులు



నవీపేట : రెంజల్ మండలంలోని కందకుర్తి గ్రామంలో గల నూతన రామాలయాన్ని మంగళవారం సందర్శించిన త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డిని మండల బీజేపీ నాయకులు కలిశారు. శాలువా మెమోంటోతో సన్మానించారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు ధ్యాగసరిన్, వంశీ మోహన్, ఆనంద్, రాజశేఖర్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

## రాజ్యాంగ పరిరక్షణకు ఐక్యంగా ఉద్యమించాలి

ఆర్మూర్: రాజ్యాంగ పరిరక్షణ కోసం ఐక్యంగా ఉద్యమించాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. రాజ్యాంగ పరిరక్షణలో భాగంగా హైదరాబాద్ నుంచి ఆర్మూర్‌కు వచ్చిన అంబేద్కరైట్ నాయకుడు కాపు రాజన్న అధితికి నీలి కండువా కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోపిడీ లేని సమాజం కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ అంబేద్కర్ యువజన సంఘం నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు ఇత్వార్పేట్ లింగన్న, త్రిశరణ బుద్ధ విహార్, ఆర్మూర్ ఉపాసకులు రాజు జాదవ్, శుభం జాదవ్, గణేష్ మహారాజ్, అడ్వకేట్ మామిడి రాజేశ్వర్, మూలనివాసి మాలజీ తదితరులున్నారు.



నినాదాలు చేస్తున్న నాయకులు

## పల్లెగంగారెడ్డికి సన్మానం



పెర్కిట్(ఆర్మూర్): జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డిని అంకాపూర్ గ్రామంలో మాజీ ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు కేసీ ముత్తెన్న మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కేసీ ముత్తెన్న మాట్లాడుతూ జాతీయ పసుపు బోర్డు చైర్మన్‌గా పల్లె గంగా రెడ్డి నియామకంతో ఆర్మూర్ ప్రాంత పసుపు రైతుల కష్టాలు తీరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్, నాయకులు బింగి పెంటయ్య, దార్ల చిన్న ముత్తెన్న, గంధం నవీన్ పటేల్ పాల్గొన్నారు.

## సృజనాత్మక నైపుణ్యాలను పెంచుకోవాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ రవీందర్‌రెడ్డి

ఆర్మూర్ : విద్యార్థులందరూ సృజనాత్మకమైన నైపుణ్యాలను పెంచుకోవాలని ప్రొఫెసర్ కే.రవీందర్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్మూర్ ఎన్ఎస్ఎస్, ఈడీసీ సంయుక్తంగా యూత్ ఫర్ స్పెషల్ ఇంపాక్ట్ అనే అంశంపై సదస్సును మంగళవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.వేణు ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ రిపబ్లిక్ పరేడ్ కర్తవ్య పథ్‌ను న్యూఢిల్లీలో పూర్తి చేసుకున్న కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సునీతను సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజు

ఆర్మూర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని మున్సిపల్ కమిషనర్ రాజు సూచించారు. పట్టణంలోని జెండా గల్లీలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ రుచికరమైన భోజనాన్ని అందించడంతో పాటు నిర్వాహకులు శుభ్రతను పాటిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజన నిర్వాహకులకు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి పలు సూచనలు చేశారు.

## సమాచారం

■ సబ్ జూనియర్ కబడ్డీ జట్ల ఎంపిక..

బాల్కొండ: కబడ్డీ సబ్ జూనియర్ బాల, బాలికల జిల్లా జట్లకు ఈ నెల 14న జెడ్పీహెచ్ఎస్ మాణిక్ బండర్ పాఠశాల మైదానంలో ఎంపిక ఉంటుందని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు లింగయ్య, ప్రధాన కార్యదర్శి గంగాధర్‌లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన జట్లు ఈ నెల 20 నుంచి 23 వరకు వికారాబాద్‌లో జరిగే ఇంటర్ జిల్లా చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికకు వచ్చే క్రీడాకారులు 1 ఏప్రిల్ 2009 తర్వాత జన్మించిన వారై ఉండాలి. బరువు 55 కేజీల లోపు ఉండాలన్నారు. క్రీడాకారులు తమ ఎస్సెస్సీ మెమో, ఆధార్ కార్డు జతపర్చాలన్నారు. ఎంపికైన క్రీడాకారులకు ఐదు రోజుల పాటు శిక్షణ శిబిరం ఉంటుందన్నారు.

## సంక్షిప్తం

**విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సాయం**

నవీపేట : మండలంలోని అబ్బా పూర్(బి ) గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి క్లోం అభిషేక్ కుటుంబానికి యంగ్ స్టార్ యూత్ ప్రతినిధులు మంగళవారం ఆర్థిక సహాయం అందజేశారు. మృతుడి తల్లిదండ్రులకు రూ. 15వేలు ఇచ్చారు.

**సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం**

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం మచ్చర్లలో మంగళవారం మాల సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. జస్టిస్ షమీమ్ అక్తర్ సిఫారసు మేరకు ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో ఆమోదం తెలిపినందుకు నిరసనగా సీఎం దిష్టి బొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో మాలల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

**పండిత్ దీన్ దయాళ్ విగ్రహానికి ఘన నివాళి**

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్ క్షత్రియ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం పండిత్ దీన్ దయాళ్ వర్ధంతిని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ ఆర్‌కే పాండే పండిత్ దీన్ దయాళ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం**

మాక్లూర్ : బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు చేవెళ్ల మహేందర్ రెడ్డిని మంగళవారం బీజేవైఎం మండల అధ్యక్షులు గగ్గోల్ల ప్రకయతేజ్ సన్మానించారు. భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో జరిగిన ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల వర్క్ షాప్ సమావేశానికి హాజరైన సందర్భంగా మహేందర్ రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో బీజేవైఎం మండల నాయకులు శ్రీకాంత్, దినేష్, కైలాస్, ప్రశాంత్, మధు పాల్గొన్నారు.

**చక్కెర కర్మాగారాన్ని పునరుద్ధరించాలి**

బోధన్‌టౌన్(బోధన్) నిజాం చక్కర కర్మాగారాన్ని పునరుద్ధరించి ప్రారంభించాలని జనతాదళ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వస్తూరి వాసు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ఎంపీ ధర్మపురి అర్వింద్‌లు ఫ్యాక్టరీ ప్రారంభానికి కృషి చేయాలని పేర్కొన్నారు.

**యాద్గార్‌పూర్‌లో పశు వైద్య శిబిరం**

రుద్రూర్: కోటగిరి మండలం యాద్గార్‌పూర్‌లో మంగళవారం పశు సంవర్ధక శాఖ, పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మండల కిసాన్ అధ్యక్షుడు ఆనంద్, మండల పశువైద్యాధికారి సీహెచ్ సురేష్, పశు వైద్య సహాయకులు సుధీర్ గౌడ్, గోపాలమిత్ర సూపర్ వైజర్ తిరుపతి, గోపాల మిత్రలు తుకారాం, నాగేష్, రియాజ్, రాజేష్ పాల్గొన్నారు.

**షాపూర్‌లో నక్క మృతి**

ఆర్మూర్: నందిపేట మండలం షాపూర్ గ్రామ శివారులోని చిన్న మోరి కెనాల్ వద్ద నక్క మృతి చెందింది. స్థానికులు మంగళవారం అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. విచారణ చేసిన వారు సమీపంలోని పంట పొలాల్లో మందులు పిచికారి చేసిన నీటిని తాగడం వల్లనే నక్క మృతి చెందినట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు.ఈమేరకు కేసు నమోదు చేసుకొని విచారణ కొనసాగిస్తున్నారు.

**కంటి వైద్య శిబిరం**

బాల్కొండ: మండలంలోని కిసాన్‌నగర్‌లో లయన్స్ క్లబ్ భవనంలో మంగళవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యురాలు ప్రవళిక వైద్య పరీక్షలు చేపట్టారు. మోతి బిందు కంటి సమస్య ఉన్న వారిని ఆర్మూర్ లయన్స్ ఆస్పత్రికి తరలించారు. లయన్స్ జిల్లా అధ్యక్షుడు చాకు లింగం, సభ్యులు తదితరులున్నారు.

**ఆర్మూర్ తాజా మాజీ చైర్ పర్సన్‌కు పితృ వియోగం**

ఆర్మూర్: ఆర్మూర్ మున్సిపల్ తాజా మాజీ చైర్ పర్సన్ వన్నెల్‌దేవ్ లావణ్యకు పితృ వియోగం కలిగింది. ఆమె తండ్రి నేల లింబన్న (68) బాల్కొండలో మంగళవారం అనారోగ్యంతో మరణించాడు. అంత్యక్రియలు బుధవారం నిర్వహించనున్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

వర్ని: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలను గెలుచుకొని తమ సత్తా చాటాలని రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షులు ఎలమంచిలి శ్రీనివాసరావు కార్యకర్తలకు సూచించారు. మంగళవారం మోస్రా మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల కోసం ఎంపీ సురేష్ షెట్కార్ నిధులు మంజూరు చేయిస్తే వాటిని రద్దు చేయించారని శ్రీనివాసరావు ఆరోపించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమే పార్టీ మారానని చెప్పుకునే ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి మంజూరైన పనులను ఎందుకు రద్దు చేయించారని శ్రీనివాసరావు ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అన్యాయం చేయడానికి, అభివృద్ధికి నిరోధకుడిగా ఎమ్మెల్యే మారారని ఆరోపించారు. ఎన్నో సంవత్సరాలుగా పార్టీలో ఉండి పార్టీ అభివృద్ధికి కష్టపడి పని చేసిన కార్యకర్తలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాసాని శ్రీనివాస్ రెడ్డి, పాత బాలకృష్ణ, భాస్కర్ ,ఇంతియాజ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

బోధన్ : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని హెల్ప్ ఏజ్ ఇండియా కో–ఆర్డినేటర్ శ్యాంకుమార్ అన్నారు. పట్టణ కేంద్రంలోని తహసీల్ ఆఫీస్ ఆవరణలో గల విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో హైదరాబాద్‌కు చెందిన హెల్ప్ ఏజ్ ఇండియా, సీనియర్ సిటిజన్స్ ఫోరం, రిటైర్డు ఎంప్లాయిస్ యూనియన్ బోధన్ శాఖల అధ్వర్యంలో మంగళవారం డిజిటల్ అక్షరాస్యత పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. సైబర్ నేరాల గురించి విశ్రాంత ఉద్యోగులకు వివరించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం డివిజన్ శాఖ అధ్యక్షుడు మురహరి, ప్రధాన కార్యదర్శి ఎం. రాజేశ్వర్, ప్రతినిధులు వై. శ్రీనివాసు, విఠల్‌రావు, భూమన్న, సాయిలు, ముత్తెన్న, విశ్వనాథం, లక్ష్మణ్‌రావు, హన్మాండ్లు, కిషన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్యాంకుమార్

## అధ్యాత్మికం

■ మల్లన్న ఉత్సవాలు ప్రారంభం



బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రం, మండలంలోని నాగాపూర్, ఇత్వార్‌పేట్, బోదేపల్లి గ్రామాల్లో మంగళవారం మల్లన్న ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాఘ పౌర్ణమి పురస్కరించుకుని ప్రతి సంవత్సరం మల్లన్న ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. ఈసందర్భంగా మల్లన్నకు పల్లకీ సేవ చేపట్టారు. బుధవారం మల్లన్న కల్యాణం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

**శివ శ్రీనివాసుని ఆలయంలో..**

ముప్కాల్ మండల కేంద్రంలో ద్రోణ గుట్టపై గల శివ శ్రీనివాస ఆలయ ఉత్సవాలు మంగళవారం రెండవ రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సుదర్శన యాగం నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు.

■ బంగారు వెంకన్న ఉత్సవాలు..

ముప్కాల్ మండలంలోని వెంచిర్యాల్ గ్రామంలో బంగారు వెంకన్న ఉత్సవాలను మంగళవారం రెండవ రోజు కొనసాగించారు. ఈసందర్భంగా హోమం, ప్రత్యేక పూజలు చేపట్టారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



డొంకేశ్వర్(ఆర్మూర్): సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గొడిసెరం భూమేశ్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని దత్తాపూర్, గాదేపల్లి గ్రామాల్లో బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. వినయ్ రెడ్డి కృషితో ముప్పాని సరితకు రూ.18వేలు, బండి ప్రసాద్‌కు రూ.60వేలు మంజూరైనట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుంకరి రాజు, రమణ, నాగరాజు, జగదీష్, సురేశ్, స్రవంతి, భూమన్న ఉన్నారు.

## విద్యార్థులకు అవగాహన



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం మగ్గిడితో పాటు పెర్కిట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం వర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కౌమారదశపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు విజయ్ కుమార్, సరిత విద్యార్థులకు కౌమార దశలో వచ్చే మార్పులను వివరించారు.రక్తహీనత, హెచ్ఐవీ, ఎయిడ్స్‌తో పాటు చట్టాలపై అవగాహన కల్పించారు.విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పాఠశాలల హెచ్ఎంలు హరిత, శ్రీనివాస్, పీఈటీ మధు తదితరులు పాల్గొన్నారు.

## వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



**పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)**

| | |
|---|---|
| స్క్రీన్-1 – | భవాని వార్డ్-1997(తెలుగు)-12.30<br>సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)-3.10 9.00<br>ఒక పథకం ప్రకారం(తెలుగు)-6.10 |
| స్క్రీన్-2 – | సంక్రాంతికి వస్తున్నాం - 10.00, 1.00, 4.00, 7.00, 10.00 |
| స్క్రీన్-3– | పట్టుదల (తెలుగు) -10.00, 1.10, 4.20, 7.30, 10.40 |
| స్క్రీన్-4 | తండేల్(తెలుగు) - 10.00, 1.05, 4.10, 7.15, 10.20 |

**ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)**

| | |
|---|---|
| స్క్రీన్-1 | తండేల్(తెలుగు)-11.00 1.45 4.40 7.35 10.30 |
| స్క్రీన్-2 | సంక్రాంతికి వస్తున్నాం - 1.30, 7.30 |
| స్క్రీన్-3 | పట్టుదల(తెలుగు)-11.00, 1.40, 4.30, 7.20, 10.10 |

**పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)**

| | |
|---|---|
| స్క్రీన్-1 | సంక్రాంతికి వస్తున్నాం - 10.30, 1.30, 4.30, 7.30, 10.30 |
| స్క్రీన్-2 | పట్టుదల (తెలుగు) - 10.05 1.15 4.25 7.35 10.45 |
| స్క్రీన్-3 | స్కై ఫోర్స్ (హిందీ) - 10.15<br>డాకు మహారాజు - 1.00, 7.20<br>దేవా (హిందీ) - 4.05, 10.25 |
| స్క్రీన్ -4 | దేవా (హిందీ) - 10.00, 7.10<br>స్కై ఫోర్స్ (హిందీ) - 1.15, 10.25<br>మదగజరాజ (తెలుగు) - 4.00 |

| | |
|---|---|
| లలితామహల్ | తండేల్(తెలుగు)-11.00, 2.00, 6.00, 10.00 |
| దేవి | పట్టుదల (తెలుగు) - 11.00, 2.00, 6.00, 10.00 |
| నటరాజ్ | బాదాస్ రవికుమార్(హిందీ)-11.00, 2.00, 6.00, 10.00 |
| విజయ్ | సంక్రాంతికి వస్తున్నాం - 10.30, 2.15, 6.10, 10.05 |

**బంగారం ధరలు (10గ్రాములు)**

| | | | |
|---|---|---|---|
| 24 క్యారెట్స్ | 87,100 | వెండి(కిలో) | 99,500 |
| 22 క్యారెట్స్ | 80,382 | | |

– నిజామాబాద్ బిజినెస్

**మాంసం ధరలు**

| | | | |
|---|---|---|---|
| చికెన్ | ధరలు (కిలోకు) | డ్రెస్సడ్ | 180 |
| | | లైవ్ | 140 |
| స్కిన్‌లెస్ | 220 | మటన్ | 800 |